

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

శాశ్వత ప్రాతిపదికన సీసీ రోడ్ల నిర్మాణం

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

బర్కత్‌పుర, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో శాశ్వత ప్రాతిపదికన సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం కాచిగూడ డివిజన్ నింబోలిఅడ్డ వద్ద రూ.25లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమాదేవితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బస్తీలో పాదయాత్ర చేసి ప్రజలెదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీలలో తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్లను ఆధునికీకరించామన్నారు. అనంతరం సీసీ రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. అభివృద్ధి పనులు ఆలస్యం కాకుండా త్వరితగతిన పూర్తయ్యేలా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంబర్‌పేట నియోజకవర్గాన్ని గ్రేటర్‌లో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కాచిగూడ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ శిరీష ఓంప్రకాష్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మాదేవ్, నాయకులు ధాత్రిక్ నాగేందర్ బాబ్జీ, సునీల్ బిడ్లాన్, బి.రవీందర్‌యాదవ్, బి.కృష్ణగౌడ్, డాక్టర్ ఓంప్రకాష్‌యాదవ్, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, సుభాష్‌పటేల్, అరవింద్, క్షీరసాగర్, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్ పాల్గొన్నారు.

దీక్షా దివస్ పేరుతో బీఆర్‌ఎస్ కొత్త డ్రామా

● టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్



మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగభూషణం, తొలుపునూరి కృష్ణగౌడ్

రాంనగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉనికి కోల్పోతున్న బీఆర్‌ఎస్ పార్టీ దీక్షా దివస్ పేరుతో కొత్త డ్రామాకు తెరలేపిందని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. శనివారం టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగభూషణం, పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, సీనియర్ నాయకుడు శ్రీకాంత్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ దీక్ష వల్ల రాలేదని, సోనియాగాంధీ చొరవ వల్లనే వచ్చిందన్నారు. 2009లో కేసీఆర్ చేపట్టిన దీక్ష పూర్తిగా నాటకమని ఎద్దేవ చేశారు. కేసీఆర్ బయటకు వస్తే ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి ఏర్పడిందని బీఆర్‌ఎస్ శకం ముగిసిందన్నారు. బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సరైన న్యాయం జరుగుతుందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు బీసీల విషయంలో రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు సరైన గౌరవం కల్పించారని అన్నారు.

జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

● కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు మోతే రోహిత్ ముదిరాజ్



మోతే రోహిత్ ముదిరాజ్‌ను సన్మానిస్తున్న రామకృష్ణ, జి.ఎన్.చారి తదితరులు

ముషీరాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు మోతే రోహిత్ ముదిరాజ్ అన్నారు. శనివారం ముషీరాబాద్‌కు చెందిన నియోజకవర్గ బీ బ్లాక్ కమిటీ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా రోహిత్ ముదిరాజ్‌ను కలిసి సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందన్నారు. రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో సహితం కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు జి.ఎన్.చారి, నాయకులు నాగరాజు, నాగిరెడ్డి పాల్గొన్నారు.



వాగ్గేయకారుల కీర్తనలు గానాలాపన చేస్తున్న సంగీత విద్వాంసులు

ముగిసిన సంగీత మహోత్సవాలు

నల్లకుంట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీభద్ర పీఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజా తూము లక్ష్మీనర్సింహదాసు 192వ ఆరాధన సంగీత మహోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ మేరకు రాజా తూము లక్ష్మీనర్సింహదాసు ఆరాధన సంగీత మహోత్సవాలలో భాగంగా ముగింపు రోజు నగరంలోని స్వరూప్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగింది. శ్రీభద్రపీఠం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు తూము వెంకటరామకృష్ణ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ ఆరాధన సంగీతోత్సవంలో ప్రముఖ సంగీత విద్వాంసులు దువ్వూరి ఉషశ్రీ, పద్మశ్రీ, వాణిశ్రీ, తబితకుమారి బృందం ఆలపించిన వాగ్గేయకారుల కీర్తనలు ఆద్యంతం సంగీతప్రియులను ఆహ్లాదపరిచాయి. ఈ కచేరీకి తమల, మృదంగంపై కే.సీ.హెచ్.నటరాజ్, కీబోర్డుపై ఎస్.వి.ఆర్.శాస్త్రీలు వాద్యసహకారం అందించారు. ఈ సందర్భంగా సంగీత కళాకారులను నిర్వాహకులు సత్కరించారు. ఆలయ ధర్మకర్తలు శ్రీమాన్ కందాడై మాలిని, శ్రీనివాసాచార్యులు దంపతుల సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

ప్రేమ స్వరూపులు సత్యసాయిబాబా



పురస్కార గ్రహీతలతో అతిథులు

చిక్కడపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రపంచశాంతి, ప్రేమ, భక్తిమార్గంలో నడిపించిన ఆధ్యాత్మిక విశ్వగురువు భగవాన్ సత్యసాయిబాబాను నిత్యం స్మరించుకుంటూనే ఉంటామని ఆధ్యాత్మిక రచయిత్రి, డా. కేవీ కృష్ణకుమారి పేర్కొన్నారు. సత్యసాయిబాబా శతజయంతి వారోత్సవాల్లో భాగంగా పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, కుసుమ ధర్మన్న కళాపీఠం ఆధ్వర్యంలో శనివారం రాత్రి త్యాగరాయగానసభలో భగవాన్ సత్యసాయిబాబా 100వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవాన్ సత్యసాయిబాబా పురస్కారాల ప్రదానం, కవిసమ్మేళనం జరిగింది. డా. అంజయ్య, డా. రామచంద్రరావు, అరుణజ్యోతి, రాకేష్, భవాని, నాగరత్నం, రాజేష్, వెంకటేశ్వర్లు, డా.కొండూరు నారాయణరెడ్డి, డా. కుసుమ, మాగంటి ప్రసాద్ బాబు, మురళీమోహన్‌రాజు, కుసుమ భోగరాజు తదితరులు పాల్గొన్నారు.

బచ్‌పన్ ఇంటర్ స్కూల్ పోటీలు

రాంనగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్ డీడీ కాలనీ, గోషామహల్, హయత్‌నగర్, అబిడ్స్, గాంధీనగర్, నల్లకుంటలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో బచ్‌పన్ ఇంటర్ స్కూల్ పోటీలను శనివారం నిర్వహించారు. విద్యార్థులు సాహిత్యం, కళలు, క్రీడలు వంటి పోటీల్లో పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. స్కూల్ రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్ రూపారెడ్డిలు పాల్గొని విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సులక్షణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ పార్సిగుట్ట చౌరస్తాలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు టి.సోమన్, డి.శివముదిరాజ్, టి.శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు



భోలక్‌పూర్ పద్మశాలీ కాలేజీ నుంచి ర్యాలీని ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు తదితరులు



తెలంగాణ భవన్‌లో దీక్షా దివస్‌లో పాల్గొన్న అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు మహేష్ ముదిరాజ్, రాజేష్ తదితరులు

ఘనంగా దీక్షా దివస్

తెలంగాణ భవన్‌కు బీఆర్‌ఎస్ శ్రేణుల ర్యాలీ

కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

ముషీరాబాద్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ సారథి కేసీఆర్ వల్లే రాష్ట్రం ఏర్పడిందని బీఆర్‌ఎస్ ముషీరాబాద్ సీనియర్ నాయకులు టి.సోమన్, డి.శివముదిరాజ్, టి.శ్రీకాంత్ ముదిరాజ్‌లు పేర్కొన్నారు. శనివారం దీక్షా దివస్‌ను పురస్కరించుకుని ముషీరాబాద్ డివిజన్‌లోని పార్సిగుట్ట చౌరస్తాలో డివిజన్ పార్టీ ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి తెలంగాణ భవన్‌కు ర్యాలీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, సీనియర్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, పి.శ్రీధర్‌చారి, పూస గోరఖ్‌నాథ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

శివాలయం చౌరస్తా నుంచి..

ముషీరాబాద్ డివిజన్ శివాలయం చౌరస్తా నుంచి డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎడ్ల భాగ్యలక్ష్మి హరిబాబుయాదవ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తెలంగాణ భవన్‌కు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు సదా, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, నాయకులు బల్ల ప్రశాంత్, జి.రాజు, బాలరాజ్‌గౌడ్, బియ్యం శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భోలక్‌పూర్ డివిజన్‌లో..

భోలక్‌పూర్ డివిజన్‌లోని పద్మశాలీ కాలనీ నుంచి బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తెలంగాణ భవన్‌కు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు బింగి నవీన్, డివిజన్ మాజీ అధ్యక్షుడు మొహమ్మద్ ఆలీ, ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, యువజన కమిటీ అధ్యక్షుడు సాయి, నాయకులు కృష్ణ, వంగల నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

రాంనగర్ గుండు చౌరస్తాలో..

రాంనగర్ : కేసీఆర్ దీక్షా దివస్ కార్యక్రమంలో భాగంగా బీఆర్‌ఎస్ అడిక్‌మెట్ డివిజన్ నాయకులు శ్రీనివాస్, కె.సురేందర్, శ్యాంసుందర్, చిట్టిల ఆధ్వర్యంలో శనివారం రాంనగర్ గుండు చౌరస్తాలో దీక్షా దివస్ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి బీఆర్‌ఎస్ నేతలు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.రవియాదవ్, అనురాధ, ఆస్లాం, రాజు, అబ్బు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ భవన్‌లో దీక్షా దివస్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్యాశ్రీనివాస్ గౌడ్, పార్టీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మేడి ప్రసాద్ తదితరులు

రాంనగర్ చౌరస్తాలో..

రాంనగర్ : దీక్షా దివస్ కార్యక్రమంలో భాగంగా పార్టీ రాంనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు రేషం మల్లేష్ ఆధ్వర్యంలో రాంనగర్ చౌరస్తాలో కేసీఆర్ చిత్రపటానికి మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. కేసీఆర్ చేపట్టిన దీక్షా దివస్ వల్లనే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరిగిరి శ్యాం, నేత శ్రీనివాస్, ఎర్రం శేఖర్ ముదిరాజ్, సత్యనారాయణ, వెంకట్రావ్, అరుణ్, వెంకటేష్, రాజేష్, అమిత్, శాస్త్రి, రమేష్‌రెడ్డి, పాలమూరు వెంకట్ పాల్గొన్నారు.

నల్లకుంట : బీఆర్‌ఎస్ దీక్షా దివస్‌ను పురస్కరించుకుని నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్ ఆధ్వర్యంలో నర్సింహబస్తీ నుంచి బీఆర్‌ఎస్ నాయకులు పెద్దఎత్తున ర్యాలీగా తెలంగాణ భవన్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షతోనే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసిందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్, మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లు పాల్గొన్న దీక్షాదివస్ కార్యక్రమంలో మేడి ప్రసాద్ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలకు రాజకీయంగా అవకాశాలు కల్పించింది టీడీపీనే

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అరవింద్‌కుమార్‌గౌడ్

రాంనగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బీసీలకు సామాజిక, ఆర్థిక, రాజకీయంగా అవకాశాలు కల్పించి చైతన్యపరిచింది టీడీపీ ఒక్కటే అని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. టీడీపీ హయాంలోనే బీసీలకు స్వర్ణయుగం అని 1983లో అధికారంలోకి వచ్చిన తర్వాతనే పేద, బలహీన వర్గాలకు పెద్దఎత్తున అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. శనివారం దోమలగూడలోని పార్టీ నగర కార్యాలయంలో నాంపల్లి నియోజకవర్గం మైనారిటీ నాయకుడు మతిన్ ఆధ్వర్యంలో అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన ఇంజనీర్ మీర్ అహ్మద్ ఆలీ తన 35 మంది అనుచరులతో కలిసి టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా వారికి అరవింద్‌కుమార్‌గౌడ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాడు టీడీపీ అధినేత, మాజీ సీఎం ఎన్టీఆర్ హయాంలో ఆదరణ పథకంతో చేతివృత్తుల వారికి ఆధునిక పనిముట్లను అందించారని గుర్తు చేశారు. టీడీపీ హయాంలోనే మైనారిటీ సంక్షేమ అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. మైనారిటీ వర్గాలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్న ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వం ముస్లిం మైనారిటీల స్వయం ఉపాధి, ఆర్థిక భరోసాకు రూ. 173.57 కోట్లు కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు, నాయకులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, కసిరెడ్డి శేఖర్‌రెడ్డి, అజ్మీరా, రాజునాయక్, కిరణ్, భానుప్రకాష్, సి.విఠల్, వీరబాబు, వెంకటేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



అహ్మద్ ఆలీకి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్‌కుమార్‌గౌడ్, నర్సింహులు, సాయిబాబా

బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

నల్లకుంట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటం చేస్తున్నామని తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా బ్రాహ్మణుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో అన్ని బ్రాహ్మణ సంఘాలను ఏకీకృతం చేసి తమకు రావాల్సిన వాటా కోసం సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. శనివారం నల్లకుంటలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలు, న్యాయమైన హక్కుల సాధన కోసం అన్ని రాజకీయ పార్టీల బ్రాహ్మణ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్, అండ్ బ్రాహ్మణ వెల్ఫేర్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 30న నల్గొండలో బ్రాహ్మణ ఉమ్మడి జిల్లా స్థాయి రాజకీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి కేంద్ర మాజీమంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, బీటీపీడబ్ల్యూఏ పొలిటికల్ కన్వీనర్ యమున పాఠక్, ఎమ్మెల్సీ వాణీదేవి, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్, ఏఐసీసీ సభ్యురాలు డాక్టర్ కోట నీలిమ, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గుండవరపు దేవీప్రసాద్‌రావు, సీపీఐ రాష్ట్ర రైతు సంఘం మాజీ అధ్యక్షుడు తమ్మెర విశ్వేశ్వరరావులతోపాటు అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈనెల 30న నల్గొండలోని శివాజీనగర్, ఎం.వీ.ఆర్.స్కూల్ ప్రాంగణంలో జరుగనున్న ఈ సమావేశానికి బ్రాహ్మణ సంఘాలు, యువత, మహిళలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, సహాయ కార్యదర్శి అక్కిరాజు దుర్గాప్రసాద్, ప్రచార కార్యదర్శి గూడ జయరాం, గాదె జయచంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోచంపల్లి రమణారావు తదితరులు

సూర్యప్రకాష్‌రావుకు మోస్ట్ ఐకానిక్ హెల్త్‌కేర్ లీడర్స్ అవార్డు

రాంనగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని కేర్ ఆస్పత్రిలో కార్డియాలజీ విభాగం చీఫ్ డాక్టర్ వి.సూర్యప్రకాష్‌రావుకు గుండె ఆపరేషన్ విధానంలో తీసుకుంటున్న అధునాతనమైన విధానాలకు గుర్తింపుగా తెలంగాణ లీడర్‌షిప్ అవార్డ్స్ - 2025 శీర్షికతో మోస్ట్ ఐకానిక్ హెల్త్‌కేర్ లీడర్స్ అవార్డును వరల్డ్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కాంగ్రెస్ అవార్డ్స్ ప్రదానం చేసింది.

అవార్డు స్వీకరించడాన్ని పురస్కరించుకుని బాగ్‌అంబర్‌పేట డివిజన్ డీడీ కాలనీలోని తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తాను సుమారు వెయ్యికిపైగా గుండె ఆపరేషన్లను ఆధునిక పద్ధతుల ద్వారా నిర్వహించడం జరిగిందన్నారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో తాను పాల్గొని గుండెకు సంబంధించిన పలు అంశాలపై ప్రసంగించి ప్రత్యేక ప్రజంటేషన్ చేయడం జరిగిందన్నారు. తాను చేస్తున్న సేవలకు గానూ తనకు మోస్ట్ ఐకానిక్ హెల్త్‌కేర్ లీడర్స్ అవార్డ్స్‌ను ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ అవార్డ్ తనకు మరింత బాధ్యతను పెంచిందన్నారు.



సూర్యప్రకాష్‌రావుకు మోస్ట్ ఐకానిక్ హెల్త్‌కేర్ లీడర్స్ అవార్డు ప్రదానం చేస్తున్న దృశ్యం

ఉన్నికోటలో గుర్తుతెలియని వ్యక్తుల ఆగడాలను అరికట్టాలి

కవాడిగూడ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ ఉన్నికోటలో గుర్తుతెలియని వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, వారి ఆగడాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం తారకరామ ఉన్నికోట వెల్ఫేర్ సెక్షన్, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కార్పొరేటర్ జి రచనశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి సాయిబాబా, ప్రధాన కార్యదర్శి బి నర్సింగ్‌గౌడ్, సలహాదారు బండ్రు రాములు, ఉపాధ్యక్షులు లోడ వెంకటేష్, ఎం శివకుమార్‌లు మాట్లాడుతూ ఉన్నికోట బస్తీ పరిసర ప్రాంతాల్లో కొందమంది గుర్తుతెలియని వ్యక్తులు తిష్టవేసి సిగరెట్లు, గంజాయి, మద్యం సేవిస్తూ స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. అర్ధరాత్రి సమయాల్లో తమ బస్తీలోకి వచ్చి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వీరి ఆగడాలను అరికట్టాలని గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. ఈ విషయంపై బస్తీలో ఒక సారి పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకొని అసాంఘిక కార్యకలాపాలు చేసే వారి ఆగడాలను అరికట్టేందుకు బస్తీ చుట్టూ గేట్లు ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని వారు కోరారు. దీనికి స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ ఉన్నికోట బస్తీలో సందర్శించి స్థానికుల సమస్యలు తెలుసుకొని గుర్తుతెలియని వ్యక్తుల బారినుంచి బస్తీవాసులకు రక్షణ కల్పించేందుకు తనవంతు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ విషయంపై గాంధీనగర్ పోలీసులతో కూడా మాట్లాడి చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు తొలుపునూరి రమేష్‌గౌడ్, బాబాచారి, బీజేపీ రాష్ట్ర నాయకుడు జి వెంకటేష్, నగర నాయకులు ఎంసీ మహేందర్‌బాబు, ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు ఎ ప్రభాకర్ గంగపుత్ర, బీజేపీ నాయకుడు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న తారకరామ ఉన్నికోట వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిబాబా, ప్రతినిధులు నర్సింగ్‌గౌడ్, వెంకట్‌గౌడ్, రాములు, బాబాచారి



ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మోతే రోహిత్ ముదిరాజ్‌ను కాంగ్రెస్ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు ఫరీద్, పార్టీ డివిజన్ సీనియర్ నాయకుడు తిరునగరి రఘురాంలు కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. - గోల్నాక, ఆంధ్రజ్యోతి

విద్యార్థులకు నోటు బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోటు బుక్స్ పంపిణీ చేస్తున్న కావ్యకిషన్‌రెడ్డి

గోల్నాక, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్ తులసీరాంనగర్(లంక)లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సతీమణి జి.కావ్యకిషన్‌రెడ్డి బీజేపీ నేతలతో కలిసి శనివారం సందర్శించి విద్యార్థులకు నోటు బుక్స్‌ను పంపిణీ చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తనకు వచ్చే జీతంతో సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులందరి పరీక్ష ఫీజును చెల్లిస్తానని చెప్పిన మాట ప్రకారం జిల్లా కలెక్టర్‌కు చెక్కు ఇవ్వడం జరిగిందని ఆమె చెప్పారు. ఈ విషయాన్ని స్వయంగా పాఠశాలకు వచ్చి ప్రధానోపాధ్యాయులకు తెలియజేసి అందుకు సంబంధించిన లెటర్‌ను ఆమె అందజేశారు. ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డితో ఆమె మాట్లాడి విషయాన్ని తెలియజేశారు. అలాగే విద్యార్థులతో ఆమె మాట్లాడుతూ కష్టపడి చదువుకుని పదవ తరగతిలో మంచి ఫలితాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సూదగాని శ్రీధర్‌గౌడ్, పార్టీ సెంట్రల్ జిల్లా కార్యాలయ కార్యదర్శి మూల రవీందర్‌గౌడ్, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేసరి నర్సింగ్‌రావుయాదవ్, పార్టీ నేతలు చింతల శ్రీనివాస్ ముదిరాజ్, మహ్మద్ సలీమ్, బి.ఈశ్వర్‌రావు, జంగయ్య, బద్రీ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తా : కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్ స్ట్రీట్‌నెంబర్ 13లో నెలకొన్న ప్రజాసమస్యలను పరిష్కరిస్తామని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ. పావనీవినయ్‌కుమార్ తెలిపారు. శనివారం అశోక్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 13 స్థానికులు చేసిన ఫిర్యాదును పురస్కరించుకుని గాంధీనగర్ వాటర్‌వర్క్స్ సెక్షన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర్, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌లతో కలిసి కార్పొరేటర్ కాలనీలో పర్యటించారు. ఈసందర్భంగా స్థానికులు ఆమెతో మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో లోప్రెషర్ సమస్యతో పాటు రోడ్డు గుంతల సమస్య వల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ఈ సమస్యలపై ప్రత్యేక చర్యలు చేపట్టి వెంటనే పరిష్కరించాలని వర్క్‌ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, నాయకులు నవీన్‌కుమార్, రత్నసాయిచంద్, దామోదర్, స్థానికులు విక్రమ్, సాయి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నిరుద్యోగ జేఏసీ నేతలు, నిరుద్యోగ విద్యార్థులు

నిరుద్యోగుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే

● నిరుద్యోగ జేఏసీ నేత శంకర్‌నాయక్

చిక్కడపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని నిరుద్యోగ జేఏసీ నేత శంకర్‌నాయక్ ఆరోపించారు. ఎల్‌బీనగర్‌లో ఆత్మహత్య చేసుకున్న నిరుద్యోగి ఆంజనేయులు చిత్రపటానికి జేఏసీ నేతలు, నిరుద్యోగ విద్యార్థులు, పోటీపరీక్షల అభ్యర్థులు శనివారం చిక్కడపల్లి సిటిసెంట్రల్ లైబ్రరీలో నివాళులు అర్పించారు. ఈసందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్న కాంగ్రెస్ పార్టీ రెండు సంవత్సరాలైనా కూడా ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వకుండా కాలయాపన చేస్తూ నిరుద్యోగుల ప్రాణాలు తీస్తుందని మండిపడ్డారు. ఉద్యోగ నోటిఫికేషన్లు లేనందు వలన ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో 15మంది నిరుద్యోగులు చనిపోయారని తెలిపారు. అయినా కూడా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని దుయ్యబట్టారు. ఆంజనేయులు కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం ఇచ్చి వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కయ్య వెంకటేష్, రేవతికుమార్, సంపత్, నర్సింహ, మధుగౌడ్, నరేష్, రమేష్, దామోదర్, సాయికిరణ్, పవన్, గణేష్, చందు, శ్రీనివాస్, బిందు పాల్గొన్నారు.